రేపు సాందీపనిలో జాబ్‌మేళా

కామారెడ్డి టౌన్, జూన్ 26: కామారెడ్డిలోని సాందీపని కళాశాలలో శుక్రవారం జాబ్‌మేళాను నిర్వహించనున్నట్లు కళాశాల డైరెక్టర్ హరిస్మరణ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సాయిబాబా, మనోజ్‌కుమార్‌లు తెలిపారు. ప్రముఖ కంపెనీలు నెట్‌అంబిట్, హెట్రో, ఈఎంఆర్‌ఐ గ్రీన్‌హెల్త్ సర్వీస్, జీవీకే ఎంటర్‌ప్రైజెస్, ఎర్‌టెల్‌పేమెంట్స్ బ్యాంక్, వరుణ్‌గ్రూప్ వివిధ ఉద్యోగాలకై జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 2022,23,24 సంవత్సరంలో డిగ్రీ పాసైన వారు దీనికి అర్హులని తెలిపారు. జాబ్‌మేళాకు హాజరయ్యే అభ్యర్థులు అప్‌డేట్ రెస్యూమ్, సర్టిఫికెట్స్ జిరాక్స్, పాస్‌పోర్ట్‌సైజ్ ఫొటోలు తేవాలన్నారు.

అదును దాటుతోంది!


అమర్లబండలో పత్తి మొక్కలకు బిందెలతో నీటిని పోస్తున్న కూలీలు

- జిల్లాలో వర్షాలు లేక సాగుకాని ఆరుతడి పంటలు
- ఆరుతడి పంటల సాగుకు మించిపోతున్న సమయం
- కొన్నిచోట్ల సోయా, పత్తి, మొక్కజొన్న విత్తనాలను విత్తినా మొలకెత్తని పరిస్థితి
- మొలకెత్తిన వాటిని బిందెలతో మొక్కలకు నీరుపోసి కాపాడుకునే ప్రయత్నం
- ఇప్పటి వరకు 55వేల ఎకరాల్లో మాత్రమే పంటల సాగు
- వర్షాల కోసం రైతుల ఎదురుచూపులు
- జిల్లాలో ఇప్పటికీ లోటు వర్షపాతమే

కామారెడ్డి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): వానకాలం ప్రారంభంతోనే కర్షకులకు కష్టాలు మొదలయ్యాయి. జిల్లాలో వర్షధార పంటలను లక్షల ఎకరాల్లోనే అన్నదాతలు సాగు చేస్తుంటారు. జిల్లాలో సాగు నీటి సౌలభ్యం లేని ప్రాంతాల్లో సోయా, మొక్కజొన్న, పత్తి, పప్పు దినుసులాంటి ఆరుతడి పంటలను రైతులు విస్తారంగానే సాగు చేస్తుంటారు. వర్షాకాలం ప్రారంభమై నెల రోజులు కావస్తున్నా ఆశించినమేర వర్షాలు లేక రైతుల్లో ఆందోళన నెలకొంటుంది. తొలకరి జల్లులు పడగానే జూన్ చివరికల్లా ఆరుతడి పంటలను రైతులు విస్తారంగా సాగు చేయాల్సి ఉంటుంది. వర్షాలు లేకపోవడంతో ఆరుతడి పంటలను సాగు చేసేందుకు అదును దాటుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే కురిసిన అడపాదడప వర్షాలతో విత్తనాలను విత్తినప్పటికీ కొన్నిచోట్ల ఎండ తీవ్రతకు మొలకెత్తక మరికొన్నిచోట్ల మొలకెత్తిన వాటిని కాపాడుకునేందుకు అన్నదాతలు అగచాట్లు పడాల్సిన పరిస్థితి ఎదురవుతు న్నాయి. వరణుడు కరుణించి వర్షాలు కురిపిస్తే కాని ఎరువాక ముందు సాగే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆరుతడి పంటల సాగుకు మించి పోతున్న సమయం

జిల్లాలో జుక్కల్, ఎల్లారెడ్డి, కామారెడ్డి డివిజన్‌ల పరిధిలో ఆరుతడి పంటలను విస్తారంగానే సాగు చేస్తుంటారు. ప్రధానంగా సోయా, పత్తి, మొక్కజొన్న, కందులు, మినుములు, పెసర్లను సుమారు లక్ష ఎకరాలకు పైగానే జిల్లాలో వానాకాలం సీజన్‌లో ప్రతీఏటా సాగవుతుంటాయి. జూలై మొదటివారంలో నైరుతి రుతుపవనాలు ప్రవేశించడం, తొలకరి జల్లులు పడడంతో రైతులు ఆరుతడి పంటల సాగుకు నిమగ్నమవుతారు. విత్తనాలను విత్తుతుంటారు. అయితే ఈ యేడు తొలకరి జల్లులు అలా పలకరించి దాదాపు పక్షం రోజులు దాటుతున్నా ఆశించిన మేర వర్షాలు లేకపాయే. మొదట్లో కురిసిన తొలకరి జల్లులకు పలు ప్రాంతాల్లో సోయా, పత్తి, మొక్కజొన్న, పప్పుదినుసు పంటల విత్తనాలను విత్తారు. అయితే వర్షాలు కురువకపోవడం ఎండల తీవ్రత ఎక్కువగా ఉండడంతో వేసిన విత్తనాలు కాస్త వేడికి మొలకెత్తలేదు. కొన్నిచోట్ల మొలకెత్తినప్పటికీ ఆ మొలకలను కాపాడుకునేందుకు రైతులు కూలీలను పెట్టి బిందెలతో నీరు పోయాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. విత్తనాలు మొలకెత్తక పోవడంతో మళ్లీ దుక్కులు దున్ని రైతులు మరోసారి విత్తనాలను విత్తేందుకు సిద్ధమవుతున్నారు. ఇలా వర్షాలు లేక రైతులకు ఆర్థిక భారం కావడమే కాకుండా తీవ్ర కష్టాలు ఎదుర్కొంటున్నారు. జూన్ చివరికల్లా ఆరుతడి పంటలు సాగు కావాల్సి ఉంటుంది. కానీ సమయం ముంచుకొస్తుండడంతో ఇక పంటలను సాగుచేస్తే ఇబ్బందులు తలెత్తుతాయని రైతులు భావిస్తున్నారు.

ఇప్పటి వరకు సాగైంది 55 వేల ఎకరాల్లో మాత్రమే

గత ఏడాది వానాకాలం సీజన్ మాదిరిగానే ఈ సీజన్‌లోనూ వర్షాలు ముఖం చాటేస్తున్నాయి. జూన్ చివరికల్లా జిల్లాలో ఆరుతడి పంటలు 80వేల ఎకరాలకు పైగా సాగు కావాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకు 55 వేల ఎకరాలల్లో మాత్రమే వివిధ పంటలు సాగైనట్లు వ్యవసాయశాఖ రికార్డులు చెబుతున్నాయి. వర్షాలు లేని కారణంగా రైతులు పంటలు సాగు చేసేందుకు వేచి చూసే ధోరణిలో ఉన్నట్లు తెలుస్తోంది. వర్షాలు పడితే కాని నాట్లు వేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. ఇప్పటి వరకు వరి 8,858 ఎకరాల్లో సాగు కాగా మొక్కజొన్న 7,209, పత్తి 6,620, సోయాబిన్ 13,816, కందులు 2,138, మినుములు 145, పెసర్లు 175 ఎకరాలలో సాగయ్యాయి. వర్షాలు పడితే కానీ ఈ ఆరుతడి పంటల సాగు ఊపందుకునే పరిస్థితి లేదు.

జిల్లాలో లోటు వర్షపాతమే

జూలై మాసం ముంచుకొస్తున్నప్పటికీ జిల్లాలో పెద్ద వర్షాలు లేక రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికీ జిల్లా వ్యాప్తంగా లోటు వర్షపాతమే నమోదైంది. సాధారణ వర్షపాతం 114.7 మి.మీ ఉండాల్సి ఉండగా ఇప్పటి వరకు కేవలం 90.0 మి.మీ వర్షపాతం మాత్రమే నమోదైంది. అంటే 21 మి.మీల వర్షపాతం తక్కువగా కురిసింది. జిల్లాలోనే కాకుండా అన్ని మండలాల్లోనూ లోటు వర్షపాతమే నమోదైంది. బిచ్కుంద, తాడ్వాయి, నాగిరెడ్డిపేట మండలాల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదు కాగా మద్నూర్, పెద్దకొడప్‌గల్, బీర్కూర్, నస్రూల్లాబాద్, లింగంపేట, సదాశివనగర్, రాజంపేట, భిక్కనూర్, రామారెడ్డి, డోంగ్లీలో సాధారణ వర్షాపాతం నమోదైంది. జుక్కల్, బాన్సువాడ, పిట్లం, నిజాంసాగర్, ఎల్లారెడ్డి, గాంధారి, కామారెడ్డి, మాచారెడ్డి, బీబీపేట, పల్వంచ మండలాల్లో లోటు వర్షపాతం నమోదైంది. ఇదే పరిస్థితులు కొనసాగితే పంటల సాగుపై తీవ్ర ప్రభావం పడనుంది.




ధర్మారావుపేటలో వర్షాలు లేక పూర్తిస్థాయిలో మొలకెత్తని సోయా


..మొక్కజొన్న


అర్గొండలో సోయా విత్తనాలు విత్తినా మొలకెత్తకపోవడంతో దుక్కులు దున్నిన రైతులు

పరిశ్రమలపై రైతులు దృష్టి సారించాలి!

కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్


స్టాళ్ల నిర్వాహకులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి టౌన్, జూన్ 26: వ్యవసాయంతో పాటు లాభదాయకమైన పాడి పరిశ్రమ, కోళ్ల పెంపకం, చేపల పెంపకం, ఆయిల్ పాం, తోటల పెంపకం వంటి వాటిపై రైతులు దృష్టి సారించి ఆర్థిక వృద్ధిసాధించాలని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. బుధవారం కామారెడ్డిలోని కళాభారతి ఆడిటోరియంలో డెయిరీ టెక్నాలజీ కళాశాల, హైదరాబాద్‌కు చెందిన జాతీయ మాంస పరిశోధన సంస్థల సంయుక్త ఆధ్వ ర్యంలో ఏర్పాటు చేసిన కిసాన్‌మేళాను కలెక్టర్ ప్రారంభించారు. అక్కడ పశు సంవర్ధకశాఖ, ఉద్యాన, మత్స్యశాఖ, విజయడెయిరీ, పరిశ్రమల శాఖ, నాబార్డు తదితర సంస్థలు తమ ఉత్పత్తులు, పరికరాలతో ఏర్పాటు చేసిన స్టాళ్లను, ప్రైవేట్ విత్తనాలు, ఎరువుల కంపెనీలు, వ్యవసాయ పరికరాలు, ట్రాక్టర్ల స్టాల్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లా డుతూ రైతులు ఆదాయ వనరులను మెరుగుపరచాలని ఉద్దేశ్యం తో రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ అనుబంధ శాఖల ద్వారా వివిధ పథకాల అమలు చేస్తూ సబ్సిడీ అందిస్తుందని అన్నారు. బ్యాంకర్లు ఉదారంగా రుణాలు అందించి రైతులకు చేయూత నివ్వాలని కోరారు. కిసాన్ మేళాల ద్వారా రైతులకు అధునాతన వ్యవసాయంలో సూచనలు, మెలకువలు, సాంకేతిక సలహాలు, శాస్త్ర పరిశోధన ఫలాలు అందిస్తూ అవగాహన కలిగిస్తుం దని, రైతులు వాటిని ఆకలింపు చేసుకుని సంపద పెంపొందించుకునే దిశగా ఎదగాలని కోరారు. పాల ఉత్పత్తి, పశు సంపద పెరగాలంటే నాణ్యమైన మేలు జాతి పాడి పశువుల ఎంపిక చేసుకోవాలన్నారు. ఆడదూడలకు ఎదసూది ఇవ్వడం ద్వారా ఆడ దూడలే పుడతాయని ఈ విషయమై పశు సంవర్ధక శాఖ అధికారులను సంప్రదించాలని రైతులకు సూచించారు. జాతీయ మాంస పరిశోధన సంస్థ డైరెక్టర్ బర్చుదే మాట్లాడుతూ రైతులకు వ్యవసాయ అనుబంధ రంగాల్లో అవగాహన నిమిత్తం కిసాన్ మేళాలు నిర్వహిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

29న తైబజార్, మేకల సంత వేలం

కామారెడ్డి టౌన్, జూన్ 26: కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని తైబజార్ వేలంను ఈనెల 29న నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ సుజాత బుధవారం తెలిపారు. 9 నెలలకు గాను తైబజార్, మేకల సంత, పశువుల సంత వేలం వేస్తున్నట్లు తెలిపారు. వేలానికి ముందు రూ.50వేలు మాత్రమే డిపాజిట్ కట్టాలని, రూ.1లక్షల గల ఆస్తి ఉన్నట్లు డిప్యూటీ తహసీల్దార్ హోదాకు తక్కువ గాని రెవెన్యూ డిపార్ట్‌మెంట్ అధికారిచే గాని లేదా మున్సిపల్ కమిషనర్ నుంచి పొందిన వాల్యూయేషన్ సర్టిఫికేట్ సమర్పించాలని తెలిపారు. డిపాజిట్ చేయని వారు వేలంలో పాల్గొనరాదని, వేలంలో పాల్గొనేవారు మున్సిపల్‌లో ఎలాంటి బకాయి ఉండరాదని, వేలం అయిన తదుపరి సైబారాదారునికి తప్పమిగితా వారి డిపాజిట్లు తిరిగి ఇవ్వబడునని తెలిపారు. పాటదారుని యొక్క డిపాజిట్ రూ.50 వేలు కలుపుకొని పాటపాడిన మిగితా రూపాయలు మొత్తం 7 రోజులలో కార్యాలయంలో చెల్లించి రశీదు పొందాలని లేకపోతే రెండో సైబారాదారునికి అప్పగించబడునని తెలిపారు. వేలంలో పాల్గొన్న అభ్యర్థులు రెండు ఖాళీ చెక్కులు ఇవ్వాలని తెలిపారు.

విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయాలి

- ఎంఆర్‌పీఎస్ టీఎస్ రాష్ట్ర కార్యదర్శి శంకర్

కామారెడ్డి టౌన్, జూన్ 26: విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయాలని ఎంఆర్‌పీఎస్ టీఎస్ రాష్ట్ర కార్యదర్శి శంకర్ అన్నారు. బుధవారం కామారెడ్డిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యాహక్కు చట్టం 2009ప్రకారం 25శాతం సీట్లు ఇవ్వకుండా చట్టాన్ని నీరుకార్చుతున్నాయని, రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచే 25 శాతం సీట్లు ఇచ్చేవిధంగా ప్రైవేట్ పాఠశాలలకు ఆదేశాలు జారీచేసి బలహీనవర్గాల పిల్లలకు అడ్మిషన్లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. ప్రభుత్వం జీవో నెంబర్ 1 ద్వారా ప్రభుత్వం రూపొందించిన సిలబస్ పుస్తకాల ద్వారానే బోధన సాగించాలని ఉత్తర్వులు ఇచ్చినా ఎక్కడా అమలు కావడం లేదని అన్నారు. పుస్తకాలు, అడ్మిషన్‌ఫీజు, యూనిఫాం, నోట్‌బుక్స్, ఇతర స్టేషనరీ, డోనేషన్ల పేరుతో ప్రైవేట్ పాఠశాలలు ఎంఆర్‌పీ రెట్ల కంటే అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రుల కష్టాన్ని దోచుకుంటున్నాయని తెలిపారు. విద్యాశాఖ అధికారులు కూడా పరోక్షంగా సహకరిస్తూ ప్రైవేట్ పాఠశాలలు చేస్తున్న దోపిడీని చూస్తు గమ్మున ఉంటున్నాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ప్రధానకార్యదర్శి లక్ష్మన్,జిల్లా అధ్యక్షుడు రామస్వామి, మండల అధ్యక్షుడు సారయ్య తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు అలవాటు పడొద్దు

జిల్లా ఎస్పీ సింధూశర్మ


పట్టణంలో ర్యాలీ ప్రారంభిస్తున్న ఎస్పీ సింధూశర్మ

కామారెడ్డి టౌన్, జూన్ 26: యువత మాదక ద్రవ్యాలకు అలవాటుపడితే జీవితం నాశనం అవుతుందని ఎస్పీ సింధూశర్మ అన్నారు. బుధవారం పట్టణంలోని కొత్త బస్టాండ్ నుంచి నిజాంసాగర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు మాదక ద్రవ్యాలకు బానిసలు కావద్దని సూచించారు. విద్యార్థులు ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని, డ్రగ్స్‌కు అలవాటు పడితే విద్యార్థులకు భవిష్యత్తు ఉండదని తెలిపారు. ఎవరైన మాదకద్రవ్యాలు స్వీకరించిన, రవాణా చేసిన, విక్రయాలకు పాల్పడిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ మాదక ద్రవ్యాల నియంత్రణ, వాటి వినియోగం వల్ల కలిగే నష్టాలను వివరించారు. భవిష్యత్తులు వినియోగించబోమని అధికారులు, విద్యార్థులు ఫ్లెక్సీలపై సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ, ఐసీడీఎస్ పీడీ బావయ్య, డీఎస్పీ నాగేశ్వర్, సీఐలు చంద్రశేఖర్‌రెడ్డి, రామన్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులను పూర్తి చేయాలి

ఎల్లారెడ్డి: పెండింగ్‌లో ఉన్న కేసులను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని ఎస్పీ సింధూ శర్మ అన్నారు. బుధవారం ఎల్లారెడ్డి డీఎస్పీ కార్యాలయాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జూలై ఒకటి నుంచి కొత్త చట్టం అమల్లోకి వస్తుందని పెండింగ్‌లో ఉన్న కేసులను పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ నరసింహ, డీఎస్పీ శ్రీనివాస్, సీఐ రవీందర్ నాయక్, ఎస్సైలు బొజ్జ మహేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న జీతాలు ఇవ్వాలి



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

కామారెడ్డి టౌన్, జూన్ 26: గ్రామ పంచాయతీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న జీతాలు చెల్లించాలని, వారిని పర్మినెంట్ చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు వెంకట్‌గౌడ్ మాట్లాడుతూ జిల్లాలో 5 నుంచి 6 నెలలు మరి కొన్ని జిల్లాల్లో 8 నుంచి 10 నెలల వరకు ఉన్నటువంటి పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని, పంచాయతీ ఉద్యోగ కార్మికులను పర్మినెంట్ చేయాలని అన్నారు. జీవో నెంబర్ 51ని సవరించి మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని పూర్తిగా రద్దు చేసి కనీస వేతనాలు అమలు చేయాలని తెలిపారు. ఆ లోపు జీవో నెంబర్ 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని కారోబార్ బిల్ కలెక్టర్‌లకు ప్రత్యేక స్టేటస్ కల్పించి సహాయ కార్యదర్శులుగా నియమించాలని తెలిపారు. పంచాయతీ సిబ్బందికి రూ.5 లక్షల ఇన్సూరెన్స్ సౌకర్యాన్ని అమలు చేయాలని, దహన ఖర్చులకు రూ.10వేల నుంచి 20వేల రూపాయలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు రాజన్న, శ్యాం, స్వామి, బాలనర్సు, మల్లేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ పౌర సమాజం కోసం మత్తు పదార్థాలను నిషేధించాలి



నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



బోధన్‌లో డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవ ర్యాలీ

పెద్దబజార్, జూన్ 26: ఉత్తమ పౌర సమాజం కోసం మత్తు పదార్థాలను నిషేధించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ అన్నారు. బుధవారం నగరంలోని సీతారాంనగర్‌లోగల స్థానిక పట్టణ ఆరోగ్య కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. మత్తు పదార్థాలను నిషేధించి మానవ అక్రమ రవాణాన్ని అరికట్టాలని అన్నారు. పాన్, గుడ్కాలు మానండి అని ఆరోగ్యాన్ని కాపాడండి, సే నోట్ డ్రగ్స్ అనే నినాదంతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి చక్కని ఆరోగ్య అలవాట్లు అలవర్చుకొని మత్తు పదార్థాలు డ్రగ్స్ లాంటి విషయాలకు పోకుండా ముఖ్యంగా పాన్‌పరాక్, గుడ్కా, సారా, కల్లు, టుబాకో, దూమపానం, ఆల్కాహాల్ లాంటి వాడకుండా ఉండాలన్నారు. గుండెజబ్బులు, హార్ట్ ఎటాక్, మధుమేహం, నరాల జబ్బు లు, పక్షవాతం, క్యాన్సర్, మానసిక వ్యాధులు లాంటివి సంభవించి జీవితమే నాశనం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆరోగ్య విద్య బోధకులు ఘన్పూర్ వెంకటేశ్వర్లు, డీఎంహెచ్‌వో సిబ్బంది స్వామి, సులోచన, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

బోధన్‌రూరల్: ఒక్కప్పుడు నగరాలకే పరిమితమైన డ్రగ్స్ మహమ్మారి ఇప్పుడు పట్టణాలు, గ్రామస్థాయి వరకు పాకిందని, అందువల్ల ప్రజలంత కలిసికట్టుగా పోరాడితేనే డ్రగ్స్ మహమ్మారిని తరమికొట్టడం పెద్ద కష్టం కాదని బోధన్ ఏసీసీ శ్రీనివాస్ అన్నారు. బుధవారం బోధన్ పట్టణంలో ప్రపంచ డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో, విద్యాసంస్థల యాజమాన్యాలతో పట్టణంలోని ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తాలో ఏసీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ డ్రగ్స్ నిర్మూలన కోసం ప్రభుత్వం ఎంత బడ్జెట్ అయిన ఇవ్వడానికి సిద్దంగా ఉందన్నారు. మాదక ద్రవ్యాల ముఠాల వెనుక ఎంత పెద్ద వారు ఉన్న కఠినంగా వ్యవహరించాలన్నారు. డ్రగ్స్‌కు అలవాటు పడితే జీవితం నాశనం అవుతుందని, వీటికి దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఎవరైనా మాదక ద్రవ్యాలు స్వీకరించిన, రవాణా చేసిన, విక్రయాలకు పాల్పడిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో సీఐలు వీరయ్య, నరేష్, ఎస్‌ఐలు నాగనాథ్, రామారావు, విద్యావికాస్ శ్రీనివాస్, విజయసాయి చక్రవర్తి, వివిధ కళాశాలల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్: యువత డ్రాగ్స్‌కు అలవాటు పడకుండా డ్రాగ్స్‌ను తరిమికొడదామని ఏసీపీ బస్వారెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి ఆయన మాట్లాడుతూ నూరేళ్ల తన జీవితాన్ని మత్తు మందుకు తాకట్టుపెట్టవద్దని, డ్రాగ్స్ మహమ్మరి నుంచి యువతను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతీఒక్కరిపై ఉందని అన్నారు. తమ పిల్లలు ఏం చేస్తున్నారో తల్లిదండ్రులు గమనించి మంచి మార్గంలో వెళ్లేలా చూడాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ శ్రీధర్‌రెడ్డి, ఎస్సైలు అశోక్, అంజమ్మ, గంగాధర్, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నవీపేట: అంతర్జాతీయ మత్తు పదార్థాల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక జడ్పీహెచ్‌ఎస్ బాలుర పాఠశాల నుంచి ప్రధాన రహదారిపై ఈ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ యాదగిరిగౌడ్, నాయబ్ తహసీల్దార్ తెలంగ్ రావు,పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కోటగిరి:మండల కేంద్రంలో జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థుల ఆధ్వర్యంలో బుధవారం డ్రగ్స్ దుష్ప్రభావాలపై ర్యాలీ నిర్వహించారు. కోటగిరి జిల్లా పరిషత్ పాఠశాల నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా ఎస్‌ఐ సందీప్ మాట్లాడుతూ విద్యార్థులు డ్రగ్స్‌కు అలవాటు పడితే భవిష్యత్ అంధకారం అవుతుందని పేర్కొన్నారు. మత్తు పదార్థాలకు విద్యార్థులకు దూరం ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఐ శ్రీనివాస్ గౌడ్, హెచ్ఎం శ్రీనివాస రావు, తదితరులు పాల్గొన్నారు.

మోర్తాడ్: యువకులు, విద్యార్థులు మారకద్రావ్యాలకు బానిసలు కాకుండా ఎస్సై అనిల్‌రెడ్డి అన్నారు. బుధవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాల పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ విద్యార్థులు, యువకులు డ్రాగ్స్‌కు బానిసలు అయ్యి తమ బంగారు భవిష్యత్‌ను నశనం చేసుకోవద్దని అన్నారు. మత్తపదార్థాలు సేవించడం వల్ల శారీరకంగా, మానసికంగా, ఆర్థికంగా, సామాజికంగా ఇబ్బందులకు గురవుతారని అన్నారు. తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనపై కనిపెడుతూ ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, లెక్చరర్, పోలీసులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి: మత్తుపదార్థాలు, డ్రాగ్స్ వినియోగం అరికట్టేందుకు ప్రతీ ఒక్కరు తమవంతు బాగస్వామ్యంకు కృషి చేయాలని ఎస్సై తిరుపతి అన్నారు. బుధవారం జక్రాన్‌పల్లిలో జిల్లా పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు మత్తుపదార్థాలను అరికట్టేందుకు అవగాహన కల్పించారు. విద్యార్థులతో కలిసి అధికారులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. బ్రాహ్మణ్‌పల్లి, గాంధీనగర్ ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. షాట్ ఫీల్మ్ం ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కిరణ్మాయి. ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీసులు పాల్గొన్నారు.

రెంజల్: మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణాకు వ్యతిరేకంగా అంతర్జాతీయ డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజలకు అవగాహన కల్పించేందుకు మండలంలోని తాడ్‌బిలోలి ఆరోగ్య కేంద్రం నుండి ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆరోగ్య విస్తీరణ అధికారి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాలకు అలవాటుకు గురి కాకుండా ఉండాలని, మాదక ద్రవ్యాల నియంత్రణ మరియు అక్రమ రవాణాకు వ్యతిరేకంగా పోరాడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రవీందర్, లక్ష్మి నారాయణ, మంజుల తదితరులు పాల్గొన్నారు.

రుద్రూరు: మత్తు పదార్థాలకు ప్రతి ఒక్కరు దూరంగా ఉండాలని రుద్రూరు ఎస్‌ఐ అప్పారావు పేర్కొన్నారు. రుద్రూరు మండల కేంద్రంలో బుధవారం పోలీసుల ఆధ్వర్యంలో ప్రపంచ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ విద్యార్థులతో కలిసి ప్ల కార్డులను ప్రదర్శిస్తూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ అప్పారావు మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదువుకుని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై రాజు, పోలీసు సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రుద్రూర్ కేజీబీవీలో..

మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో బుధవారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నిర్మూలన దినోత్సవం సందర్భంగా పబ్లిక్ హెల్త్ నర్సింగ్ ఆఫీసర్ క్రిష్ణవేణి మాదక ద్రవ్యాల వలన కలిగే అనర్థాలు, దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ సుమతి, పాఠశాల ప్రత్యేక అధికారిణి శ్యామల, హెల్త్ వర్కర్లు గౌరి, శిరీషా, పాల్గొన్నారు.

ముప్కాల్: మారక ద్రవ్యాల వినియోగంతో భవిష్యత్ అంధకారం అవుతుందని బాల్కొండ ఎస్సై గోపి అన్నారు. బుధవారం ముప్కాల్, బాల్కొండ మండల కేంద్రంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మారక ద్రావ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా విద్యార్థులచే అవగాహన కల్పించిన అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముప్కాల్ ఎస్సై బాస్కరచారి, హెచ్ఎం ఎఎస్సై గంగారాం, విద్యార్థులు పాల్గొన్నారు.

కాలుజారి రైలు కింద పడి ఒకరికి గాయాలు

డిచ్‌పల్లి, జూన్26: డిచ్‌పల్లి రైల్వేస్టేషన్ ప్రాంతంలో విష్ణు(50) రైల్లో తినుబండారాలు అమ్ముతూ జీవినం సాగిస్తుంటాడు. బుధవారం డిచ్‌పల్లి రైల్వేస్టేషన్ వద్ద కదులుతున్న రైలు సమయంలో ప్లాట్‌ఫాం కింద పడిపోయాడు. అయితే 108సిబ్బంది కిషన్, సురేష్‌లు గాయపడ్డ విష్ణును జిల్లా కేంద్రానికి తరలించారు. ఎడమకాలు నుజ్జునుజ్జు కావడంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్ తరలించారు.

● కదులుతున్న రైలు నుంచి జారి పడి ఒకరి మృతి

నిజామాబాద్ పట్టణంలోని దుబ్బా ప్రాంతానికి చెందిన డి.స్వామి(22) కాలు జారీ రైల్వే నుంచి పడిపోగా తలకు, చేతులకు తీవ్రగాయాలై డిచ్‌పల్లి ఇందల్వాయి రైల్వేస్టేషన్ మధ్యలో మృతి చెందినట్టు రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు తైబజార్ వేలం

నందిపేట, జూన్ 26: మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో గురువారం తైబజార్ వేలంపాట నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి నవీన్ తెలపారు. వారంతపు సంతకు రూ.50వేలు, రోజువారి సంతకు రూ.30వేలు డిపాజిట్ చెల్లించి వేలంపాటలో పాల్గొనాలని కోరారు. ఉదయం 10.390గంటలకు నిర్వహించే వేలంపాటకు పంచాయతీ బకాయిలు ఉన్నవారు అర్హులని పంచాయతీ కార్యదర్శి ప్రవీన్ చెప్పారు.

ఎడపల్లిలో తైబజారు వేలం వాయిదా

ఎడపల్లి, జూన్ 26: ఎడపల్లి మండల కేంద్రంలో ప్రతీ మంగళవారం జరిగే వారాంతపు సంతకు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో బుధవారం తైబజార్ వేలంపాట డిఎల్‌పిఓ సాయిబాబా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ వేలంపాటలో ఇద్దరు 20 వేల రూపాయల దరావత్తు చెల్లించి వేలంపాటలో పాల్గొన్నారు. వారిరువురు వేలంపాట పాడగా గ్రామ పంచాయితీ నిర్ణయించిన నాలుగు లక్షల అరవై వేల ధర రాకపోవడంతో వేలంపాటను 28వ తేదీకి వాయిదా వేశారు. వేలం పాటలో ఎవరైనా ఆసక్తి ఉన్నవారు 20 వేల ధరావత్తు చెల్లించి పాల్గినవల్సిందిగా పంచాయితీ కార్యదర్శి నాగరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ రవి ప్రకాష్ రెడ్డి, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

వేల్పూర్‌లో విద్యార్థులకు నోట్‌పుస్తకాల పంపిణీ

వేల్పూర్, జూన్ 26: మండల కేంద్రంలో బీసీ కాలనీలో ప్రాథమిక పాఠశాలలో ప్రశాంతన్న యువసేన ఆధ్వర్యంలో బుధవారం పాఠశాల చెందిన 29 విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులను పంపిణీ చేశారు. బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి కలువడానికి వచ్చిన ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, వివిధ కుల సంఘాల వారు ఇచ్చినటువంటి ఉచిత నోట్‌బుక్‌లు, పెన్నులను నిరుపేద విద్యార్థులకు అందించడం జరుగుతుందని ప్రశాంతన్న యువసేన నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్‌టీఏ కమిటీ సభ్యుడు రేగుల్ల రాములు, ఆత్మకమిటీ చైర్మన్ నోముల రవీంధర్, బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, మొండి అశోక్, నవీన్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పెంటన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మైనారిటీ పాఠశాలలలో బ్లాక్‌లాగ్ ప్రవేశాల కోసం దరఖాస్తుల ఆహ్వానం

కోటగిరి,జూన్26: కోటగిరి మండల కేంద్రంలోని మైనారిటీ గురుకుల బాలుర పాఠశాలలలో బ్లాక్‌లాగ్ ప్రవేశాలకై దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ శివకుమార్ తెలిపారు. 5వ తరగతిలో ఓసీ కేటగిరిలో రెండు సీట్లు, 6వ తరగతిలో ఓసీ కేటగిరిలో రెండు సీట్లు, 7వ తరగతిలో ఎస్సీ కేటగిరిలో ఒకటి, ఓసీ కేటగిరిలో ఒకటి, 8వ తరగతిలో ఓసీ కేటగిరిలో రెండు సీట్లను లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేస్తామన్నారు. 9,10వ తరగతుల్లో బ్లాక్‌లాగ్ ప్రవేశాలకు పరీక్షల ద్వారా ఎంపిక చేస్తామన్నారు.ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నవీపేటలో ట్రాలీ వాహనానికి నిప్పు

నవీపేట,జూన్26: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట ఖాళీ స్థలంలో నిలిపిఉంచిన ట్రాలీ వాహనానికి మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించి దగ్ధం చేశారు. స్థానిక కిరాణ దుకాణ యాజమాని కొండ అశోక్‌కు చెందిన ట్రాలీ వాహనాన్ని ఖాళీ స్థలంలో నిలిపి ఉంచగా మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు వాహన టైర్లకు నిప్పంటించడంలో దగ్ధమైంది. కొండ అశోక్ కుమారుడు కార్తీక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ యాదగిరి గౌడ్ తెలిపారు.

రామన్నపేట్‌లో ఛత్రపతి సాహు జయంతి

వేల్పూర్, జూన్26: మండలంలోని రామన్నపేట్ గ్రామంలో షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఛత్రపతిసాహు 150వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు బాబురాం ఛత్రపతిసాహు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో రిజర్వేషన్ మొట్టమొదటి సారిగా 1902లో ప్రవేశపెట్టిన మహానీయుడు చత్రపతిశివాజీ మహరాజ్ మనవడు సాహు మహరాజ్ అన్నారు. సాహు మహరాజ్ దేశానికి అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో షెడ్యూల కులాల సంక్షేమ సంఘం కార్యవర్గ సభ్యుడు సుమన్, దినేష్, వినోద్; తదితరులు ఉన్నారు.

నేటి నుంచి ఇంటింటి సర్వే

ఎడపల్లి, జూన్ 26: ఎడపల్లి మండలంలోని అన్ని గ్రామాలలో గురువారం నుండి వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి సంబందించి ఇంటింటి సర్వే నిర్వహించాలని మండల అభివృద్ధి అధికారి శంకర్ నాయక్ కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పంచాయితీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో ప్రతి ఇంటికి వెళ్ళి ఇంట్లో వ్యక్తిగత మరుగుదొడ్డి ఉందా, లేదా అనే విషయాలను నమోదు చేయాలని కోరారు. వారం రోజులలో ఈ సర్వే పూర్తి చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిఓ రవి ప్రకాష్ రెడ్డి, పంచాయితీ కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

బోధన్‌రూరల్,జూన్26: రైతుల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ ధ్యేయం, ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం 2లక్షల రైతు రుణమాఫీ ఏకకాలంలో సీఎం రేవంత్ రెడ్డి చేయడం అభినందనీయమని టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్ అన్నారు. బుధవారం మండలంలోని కల్దుర్కి గ్రామంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం రైతులను పట్టించుకోలేదని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే గ్యారంటీ పథకాలను అమలు చేస్తూ వచ్చిందని, రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం సీఎం రేవంత్ రెడ్డి ఏకకాలంలో రుణమాఫీ చేస్తున్నారని కాంగ్రెస్ ప్రభుత్వం రైతుపక్షపాతి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు నాగేశ్వర్ రావు, కల్దుర్కి సొసైటీ చైర్మన్ శరత్, గణపతి రెడ్డి, అల్లె రమేష్, ప్రకాష్ పటేల్, అల్లె జనార్ధన్, రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గురుకుల అభ్యర్థుల సమస్యలు పరిష్కరించాలి

» సర్కార్‌కు వారి బాధలు కనిపించట్లేదా?: హరీశ్‌రావు

హైదరాబాద్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): రాజకీయాలే పరమావధిగా నడుస్తున్న ప్రజా ప్రభుత్వానికి గురుకుల టీచర్ పోస్టుల అభ్యర్థుల బాధలు కనిపించకపోవడం బాధాకరమని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. మంత్రులు, అధికారులను కలిసి ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా.. సీఎం ఇంటి ముందు మోకాళ్ల మీద నిలబడి అభ్యర్థించినా గురుకుల అభ్యర్థుల మొర ఆలకించకపోవడం శోచనీయమన్నారు. బుధవారం ఆయన 'ఎక్స్' వేదికగా గురుకుల అభ్యర్థుల నిరసనకు మద్దతు ప్రకటించారు. వారి సమస్యలను తక్షణం పరిష్కరించాలని బీఆర్ఎస్ తరఫున ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పోస్టులు బ్యాక్‌లాగ్ కాకుండా రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం అన్నింటినీ భర్తీ చేసి నిరుద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కాగా, కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీలో నెలకొన్న ఇబ్బందులను పరిష్కరించేందుకు జీవో46ను సవరించాలని బీఆర్ఎస్ నేత రాకేశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. జీవో46కు సంబధించిన కేసు విచారణను అడ్వకేట్ జనరల్ ఉద్దేశపూర్వకంగా వాయిదా వేయించారని ఆరోపించారు.

కేసీఆర్ భూముల కోసమే అలైన్‌మెంట్ మార్చారు

» 'ఆర్ఆర్ఆర్' భూనిర్వాసితుల ఐక్య వేదిక

గజ్వేల్, జూన్ 26: తన భూముల విలువ పెంచుకునేందుకే మాజీ సీఎం కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు రీజినల్ రింగ్‌రోడ్డు (ఆర్ఆర్ఆర్) అలైన్‌మెంట్‌ను మార్చారని భూనిర్వాసితుల ఐక్య వేదిక నేతలు మండిపడ్డారు. ఈ అలైన్‌మెంట్‌ను మార్చాల్సిందేనంటూ వారు డిమాండ్ చేశారు. బుధవారం గజ్వేల్‌లో ఆర్ఆర్ఆర్ భూనిర్వాసితులు ర్యాలీ, ధర్నా నిర్వహించారు. అనంతరం గజ్వేల్ ఆర్డీవో బన్సీలాల్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇప్పటికే తమ భూముల నుంచి కొండపోచమ్మ సాగర్ కాలువలు వెళ్లాయని వెళ్లాయని, ఇప్పుడు రీజినల్ రింగ్ రోడ్డు వెళ్తే.. ఆత్మహత్యలే శరణ్యమని ఆవేదన వ్యక్తం చేశారు. తమ భూములకు ఆర్డీవో ఎకరాకు రూ.7.50లక్షలు మాత్రమే ఇస్తామంటున్నారని, ఆ డబ్బుతో ఏం వస్తుందని ప్రశ్నించారు. లోక్‌సభ ఎన్నికల ముందు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని కలిసినప్పుడు తమకు న్యాయం చేస్తామన్నారని, ఇప్పుడు టెండర్లను పిలుస్తున్నట్లు ప్రకటించడం సరికాదని ఆక్షేపించారు. ఇప్పటికే ఉన్న చిట్యాల-సంగారెడ్డి 161 జాతీయ రహదారినే రీజినల్ రింగ్ రోడ్డుగా మార్చాలని డిమాండ్ చేశారు.

రుణమాఫీకి షరతులు..వెన్నుపోటే: కిసాన్‌మోర్చా

హైదరాబాద్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక ప్రారంభ, ముగింపు తేదీలు అంటూ షరతులు విధించడం.. రైతులకు వెన్నుపోటు పొడవడమేనని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్ రెడ్డి విమర్శించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం జరిగిన రాష్ట్ర పదాధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.2లక్షల రుణమాఫీపై తుక్కుగూడ సభలో రాహుల్ గాంధీతో హామీ ఇప్పించారని, దాన్ని అమలు చేయకపోతే ప్రజలే ఆ పార్టీ నేతల తుక్కు రేగ్గొడతారని హెచ్చరించారు. ఖరీఫ్‌లో పెట్టుబడికి డబ్బులు లేక రైతులు అల్లాడుతుంటే... అభిప్రాయ సేకరణ అంటూ ఆటలాడుతున్నారని మండిపడ్డారు. షరతులు లేకుండా రుణమాఫీ అమలు చేయాలని, లేదంటే బీజేపీ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు.

పెన్షనర్ల సమస్యలపై ఉద్యమిస్తాం: జేఏసీ

సమస్యల పరిష్కారం కోసం జూలై నుంచి ఆందోళనలు చేపట్టాలని నిర్ణయించినట్లు తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్ల జేఏసీ వెల్లడించింది. ఈ మేరకు బుధవారం సీఎస్‌కు నోటీసు అందజేసినట్లు జేఏసీ చైర్మన్ కె.లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శి శుభాకర్‌రావు తెలిపారు. పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వానికి అనేక సందర్భాల్లో వినతి పత్రాలు ఇచ్చినా పట్టించుకోలేదని పేర్కొన్నారు. ఈ మేరకు జూలై 15న అన్ని జిల్లా కేంద్రాల్లో సమావేశాలు పెట్టి కలెక్టర్లకు వినతిపత్రాలు ఇస్తామని వెల్లడించారు. వేలాది మంది పెన్షనర్లతో జూలై 30న ఇందిరాపార్కు వద్ద మౌనదీక్ష చేస్తామని తెలిపారు.

అవినీతికి పాల్పడలేదని పొన్నం చెప్పగలరా?

» మంత్రుల అవినీతిని బ్లాక్ బుక్‌లో నమోదు చేస్తున్నాం

» బీఆర్ఎస్ మళ్లీ వచ్చాక ఎవర్నీ వదిలిపెట్టం: కౌశిక్‌రెడ్డి

బంజారాహిల్స్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): అవినీతికి పాల్పడలేదని మంత్రి పొన్నం ప్రభాకర్ దేవుడిపై ప్రమాణం చేస్తారా? అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి నిలదీశారు. ఆయన ప్రమాణం చేస్తే క్షమాపణ చెప్పేందుకు తాను సిద్ధమని ప్రకటించారు. ఫ్లై యాష్ తరలింపులో మంత్రి పొన్నం ప్రభాకర్ రూ.100 కోట్ల మేర అవినీతికి పాల్పడ్డారని ఆరోపించిన కౌశిక్‌రెడ్డి.. జూబ్లీహిల్స్ టీటీడీ ఆలయానికి వస్తే నిరూపిస్తానని సవాల్ విసిరారు. ఈ మేరకు బుధవారం టీటీడీ ఆలయానికి వచ్చిన కౌశిక్‌రెడ్డి.. అక్కడ మీడియాతో మాట్లాడారు. తన ఆరోపణలపై మంత్రి పొన్నం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. లీగల్ నోటీసులు పంపిస్తే భయపడేది లేదని స్పష్టం చేశారు. ఫ్లై యాష్ లారీలను తానే స్వయంగా హుజూరాబాద్‌లో పట్టుకున్నానని, వే బ్రిడ్జికి తరలించి తూకం వేస్తే 76 టన్నులు పైగా తీసుకెళ్తున్నట్లు తేలిందన్నారు. నిబంధనల ప్రకారం 16 టైర్ల లారీలో 36 టన్నులు మాత్రమే తీసుకువెళ్లాల్సి ఉంటుందని తెలిపారు. ఈ వ్యవహారంలో రవాణా శాఖ మంత్రికి సంబంధం లేదా?అని ప్రశ్నించారు. మంత్రుల అవినీతిని బ్లాక్ బుక్‌లో నమోదు చేస్తున్నట్టు, మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక ఎవరినీ వదిలేది లేదని హెచ్చరించారు.



ప్రధాని మోదీని కలిసిన బండారు దత్తాత్రేయ, కుటుంబ సభ్యులు

మోదీకి గవర్నర్ దత్తాత్రేయ అభినందనలు

న్యూఢిల్లీ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మూడోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన నరేంద్ర మోదీకి హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ అభినందనలు తెలిపారు. బుధవారం ఢిల్లీలోని పార్లమెంట్ హౌస్‌లో ప్రధాని మోదీని దత్తాత్రేయ కుటుంబ సభ్యులతో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కృష్ణభగవానుని 'విరాట్ స్వరూప్' విగ్రహాన్ని ప్రధానికి బహూకరించారు. గవర్నర్ సతీమణి బండారు వసంత, కుమార్తె బండారు విజయలక్ష్మి, అల్లుడు, డాక్టర్ బి.జిగ్నేష్ రెడ్డి, బండారు శివశంకర్, మనవరాళ్లు యశోధర రెడ్డి, వేదాంషి రెడ్డిలు మోదీకి శుభాకాంక్షలు తెలిపారు. యశోధర, వేదాంషి ప్రధాని కోసం రెండు పాటలు పాడగా.. మోదీ వారిని ప్రత్యేకంగా అభినందించి, ఆశీర్వదించారు. మరోవైపు.. ప్రధానిమోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాను త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనా రెడ్డి కలిశారు.

మేడిగడ్డ డిజైన్ ఒకటైతే..నిర్మాణం మరోరకంగా

» తుమ్మిడి హెట్టిని పునఃపరిశీలించాలి: కోదండరాం

హైదరాబాద్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మేడిగడ్డ ప్రాజెక్టు డిజైన్ ఒకటైతే నిర్మాణం మరోరకంగా చేశారని, అందుకే అది కుంగిందని టీజేఎస్ అధినేత కోదండరాం అన్నారు. ప్రాజెక్టు నిర్మాణంలో నాణ్యత లేదని, నిర్వహణ కూడా సరిగా లేదని ఆరోపించారు. ఈ విషయాలను డ్యామ్ సేఫ్టీ అధికారులే వెల్లడించారని చెప్పారు. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ సుజల స్రవంతి పేరుతో కాంగ్రెస్ హయాంలో తుమ్మిడిహెట్టి వద్ద చేపట్టిన ప్రాజెక్టుకు సంబంధించి రూ.800కోట్ల ఖర్చుతో కాల్వల నిర్మాణం చేపట్టారని గుర్తుచేశారు. తుమ్మిడి హెట్టిని పునఃపరిశీలన చేసి కొంతమేరకు పనులు చేసినట్లయితే.. అప్పుడు చేపట్టిన కాల్వల ద్వారా నీటిని తీసుకొచ్చే అవకాశం ఉందన్నారు. మేడిగడ్డ తప్పిదానికి బాధ్యులపై చర్యలు తీసుకుని శిక్షలు వేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్తు కొనుగోళ్లకు సంబంధించి విచారణ కమిషన్ వేయాలని అడిగిందే బీఆర్ఎస్ వాళ్లన్నారు. ఇప్పుడు కమిషన్‌కు అర్హత లేదని చెప్పి.. వాస్తవాలు తెలియకుండా అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. రైల్‌రోకో కేసులో కేసీఆర్‌తో పాటు తానూ ఉన్నానని గుర్తు చేసిన కోదండరాం.. ఉద్యమకారులందరిపై కేసులు తొలగించాలని కోరాల్సింది పోయి.. ఆయనపైన ఉన్న కేసులే తొలగించాలనడం విడ్డూరమన్నారు.

స్పీకర్.. అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదు

» మెయిల్, స్పీడ్ పోస్టులో ఫిర్యాదులు పంపాం

» పోచారం, సంజయ్‌ను అనర్హులుగా ప్రకటించాలి

» ఇళ్లకు వెళ్లి కండువాలు కప్పడం సిగ్గుచేటు: జగదీశ్‌రెడ్డి



హైదరాబాద్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ తరఫున గెలిచిన పోచారం శ్రీనివాస్‌రెడ్డి, సంజయ్ కుమార్ కాంగ్రెస్‌లో చేరడం చట్ట వ్యతిరేకమని, వారిని అనర్హులుగా ప్రకటించాలని ఎమ్మెల్యే జి.జగదీశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను కలిసి ఫిర్యాదు చేద్దామంటే ఆయన అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదని ఆరోపించారు. ఆ ఇద్దరిపై అనర్హత వేటువేయాలని కోరుతూ స్పీకర్, అసెంబ్లీ కార్యదర్శికి వేర్వేరుగా ఈ మెయిల్, స్పీడ్ పోస్టు ద్వారా ఫిర్యాదులు పంపామన్నారు. తెలంగాణ భవన్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వారిద్దరిపై స్పీకర్ చర్యలు తీసుకోకుంటే న్యాయపరంగా ముందుకెళ్తామన్నారు. పాంచ్‌న్యాయ్‌లో ఫిరాయింపులను ఆమోదించబోమని చెప్పిన కాంగ్రెస్.. ఇప్పుడు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను ఎలా చేర్చేకుంటోందని ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలో చట్టప్రకారం రెండు వంతుల మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తమ పార్టీలో చేరారని గుర్తు చేశారు. తమ పార్టీలో చేరిన వారంతా కేసీఆర్ వద్దకు వచ్చి కండువాలు కప్పుకొన్నారని, కానీ.. ఇప్పుడు రేవంత్ ఇంటింటికి తిరిగి కండువాలు కప్పడం సిగ్గుచేటన్నారు.

ఫిరాయింపులపై కేటీఆర్ మొసలి కన్నీరు

» త్వరలోనే బీఆర్ఎస్ నుంచి మరిన్ని చేరికలు: విప్ ఆది శ్రీనివాస్



హైదరాబాద్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): పార్టీ ఫిరాయింపులపైన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. మొసలి కన్నీరు కారుస్తున్నారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆరోపించారు. గతంలో టీడీపీ నుంచి గెలిచిన తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను బీఆర్ఎస్‌లో చేర్చుకుని మంత్రిని చేసినప్పుడు కేసీఆర్‌ను ఎందుకు నిలదీయలేదని ప్రశ్నించారు. 2019లో 12 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను బీఆర్ఎస్‌లో చేర్చుకున్నప్పుడు ప్రజాస్వామ్యం ఎటు పోయిందో కేటీఆర్ చెప్పాలన్నారు. సీఎల్పీ మీడియా హాల్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్ కార్యక్రమాలకు ఆకర్షితులై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు కేసీఆర్.. తన ఫామ్ హౌస్‌లో వీడ్కోలు పార్టీ ఇస్తున్నారని ఎద్దేవా చేశారు. ఆ పార్టీ మునుగుతున్న నావ అని, రేవంత్‌రెడ్డి అనే తుఫానులో ఆ పార్టీ కొట్టుకుపోవడం ఖాయమని స్పష్టం చేశారు. అధికారంలో ఉన్నపుడు ఎమ్మెల్యేలను హీనాతి హీనంగా చూసిన చరిత్ర కేసీఆర్‌ది అని ధ్వజమెత్తారు. త్వరలోనే బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి మరిన్ని చేరికలుంటాయని స్పష్టం చేశారు. ఆ పార్టీలో మిగిలేది నలుగురేనన్నారు. కాగా, దివ్యాంగులకు ఉన్నత విద్యలో 5శాతం రిజర్వేషన్ కల్పించిన సీఎం రేవంత్‌రెడ్డి.. వారి ఆత్మబంధువుగా మారారని టీపీసీసీ దివ్యాంగుల సెల్ చైర్మన్ ముత్తినేని వీరయ్య కొనియాడారు.

మెట్టు దిగిన ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

కాంగ్రెస్సే ముఖ్యమని వెల్లడి.. కేసీ వేణుగోపాల్, దీపాదాస్ మున్షీతో భేటీ

» ఫలించిన అధిష్ఠానం బుజ్జగింపులు

» కాంగ్రెస్‌తోనే జాతి ఐక్యత: జీవన్ రెడ్డి

» పార్టీలో మొదటి నుంచి ఉన్నవారికి ప్రాధాన్యం: దీపాదాస్ మున్షీ



ఢిల్లీలోని తెలంగాణ భవన్ వద్ద ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

న్యూఢిల్లీ, జూన్ 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి వీడడం ఖాయమన్న వార్తలకు ఫుల్‌స్టాప్ పడింది. తనకు సమాచారం ఇవ్వకుండానే జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను కాంగ్రెస్‌లో చేర్చుకున్నారని తీవ్ర మనస్తాపం చెందిన జీవన్‌రెడ్డి ఎట్టకేలకు మెట్టు దిగారు. కష్టకాలంలో పార్టీకి అండగా ఉన్నవాళ్ల అభిప్రాయాల ఆధారంగానే చేరికలు, ఇతర విషయాలలో ముందుకెళతామని అధిష్ఠానం హామీ ఇవ్వడంతో ఆయన శాంతించారు. రంగంలోకి దిగిన ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ పరిస్థితిని చక్కబెట్టారు. మూడ్రోజులుగా అసంతృప్తితో రగిలిపోతూ పార్టీని వీడేందుకు సిద్ధపడిన జీవన్‌రెడ్డికి పార్టీ అధిష్ఠానం నుంచి పిలుపు వచ్చింది. కేసీ వేణుగోపాల్ ఫోన్ చేసి ఢిల్లీ రావాలని కోరడంతో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి బుధవారం సాయంత్రం జీవన్ రెడ్డి ఢిల్లీకి చేరుకున్నారు. తెలంగాణ భవన్‌లోని శబరి బ్లాక్‌లో జీవన్‌రెడ్డితో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అరగంటపాటు చర్చలు జరిపారు. అయినా జీవన్‌రెడ్డి వెనక్కి తగ్గలేదు. ఆ తర్వాత ముగ్గురూ కలిసి కేసీ వేణుగోపాల్ ఇంటికి వెళ్లి ఆయనతో భేటీ అయ్యారు. కాంగ్రెస్ కష్టకాలంలో ఉన్నప్పుడు ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌లోకి వెళ్లినా తాను పార్టీని నమ్ముకుని ఉన్నానని ఈ సందర్భంగా జీవన్ రెడ్డి చెప్పినట్లు తెలిసింది. కాంగ్రెస్‌లో ఎమ్మెల్యే సంజయ్ చేరికపై అసంతృప్తి వ్యక్తం చేశారని సమాచారం. జీవన్‌రెడ్డిని బుజ్జగించిన పెద్దలు.. పార్టీ అండగా ఉంటుందని, దేశంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పుంజుకుంటున్న సమయంలో పార్టీని వీడవద్దని కోరినట్లు తెలిసింది. దీంతో చల్లబడిన జీవన్‌రెడ్డి సమ్మతించారు. భేటీ అనంతరం బయటికి వచ్చాక జీవన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. తనకు కాంగ్రెస్సే ముఖ్యమంటూ వెల్లడించారు. కార్యకర్తలను కాపాడుకోవడం ఏ పార్టీకైనా ముఖ్యమని అన్నారు. కార్యకర్తల ఆత్మగౌరవాన్ని దృష్టిలో పెట్టుకుని, వారి ఆలోచనలకు అనుగుణంగానే నిర్ణయాలు తీసుకోవాలన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మెరుగైన ఫలితాలు వచ్చాయని, లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా రాహుల్ గాంధీ నియామకం పట్ల హర్షం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో రాహుల్‌గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని, జాతి ఐక్యతను కాంగ్రెస్ కాపాడుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల హామీలను కాంగ్రెస్ నెరవేరుస్తుందన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాలలో అమలుకాని పథకాలను తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ఏకకాలంలో రూ.31 వేల కోట్లతో రుణమాఫీకి కాంగ్రెస్ సంకల్పించడని ఆయన హర్షం వ్యక్తం చేశారు.

ఫిరాయింపులపై బీఆర్ఎస్ మాట్లాడటమా?: దుద్దిళ్ల

పార్టీలో సీనియర్ నేత అయిన జీవన్‌రెడ్డిని కించపరచడం తమ ఉద్దేశ్యం పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ అన్నారు. జగిత్యాల ఎమ్మెల్యే చేరికను అగౌరవంగా, అమర్యాదగా భావించి ఉండవచ్చన్నారు. పార్టీలో చేరికలకు తలుపులు తెరిచే ఉన్నాయన్నారు. కాంగ్రెస్‌లో మొదటి నుంచి ఉన్నవారికి ప్రాధాన్యం తగ్గకుండా చూస్తామని స్పష్టం చేశారు. ఏ నిర్ణయం తీసుకున్నా కేసీ వేణుగోపాల్‌తో చర్చించే తీసుకుంటామని చెప్పారు. మీడియా అడిగిన ప్రశ్నలకు స్పందిస్తూ.. టీపీసీసీ అధ్యక్ష పదవిపై నిర్ణయం అధిష్ఠానానిదేనని ఆమె పేర్కొన్నారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. పార్టీ ఫిరాయింపులపై బీఆర్ఎస్ నేతల విమర్శలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు. ఫిరాయింపులపై ప్రశ్నించేందుకు ఆ పార్టీకి కాస్త అయినా నైతికత ఉండాలని మండిపడ్డారు. అధికారంలో ఉండగా కాంగ్రెస్‌ను అంతం చేయాలని ప్రయత్నించారన్నారు. ఇపుడు బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య మార్పు ఎలా ఉందో స్పష్టంగా కనపడుతోందని ఆయన పేర్కొన్నారు.

డ్రగ్స్‌కు బానిసైతే భవిష్యత్తు అంధకారం

» యువత వ్యసనాలు వీడి ఉన్నత లక్ష్యాలు చేరాలి: జూపల్లి

» మాదక ద్రవ్యాల మత్తులోనే లైంగిక దాడులు, హత్యలు: సీతక్క

మాదాపూర్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాలకు బానిసైతే ఉజ్వల భవిష్యత్తు అంధకారమవుతుందని, యువత వ్యసనాలను వీడి లక్ష్యం వైపు అడుగులేసి ఉన్నత స్థాయికి చేరుకుని భావితరాలకు స్ఫూర్తిగా నిలవాలని ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మాదాపూర్‌లోని శిల్పకళావేదికలో తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో ఆధ్వర్యంలో నిర్వహించిన 'డ్రగ్స్ నియంత్రణ.. అక్రమ రవాణాపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మంత్రి సీతక్కతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జూపల్లి మాట్లాడుతూ.. మానవ జన్మ ఎంతో ఉత్తమమైనదని.. కానీ చెడు వ్యసనాల కారణంగా అనారోగ్యం పాలైన చాలామంది అర్ధాంతరంగా తనువు చాలిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచానికి ఉగ్రవాదం తర్వాత అంతటి పెనుసవాలుగా డ్రగ్స్ వినియోగం మారిందన్నారు. పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు కూడా డ్రగ్స్ చేరడం ఆందోళన కలిగించే విషయమన్నారు. సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలో డ్రగ్స్ నియంత్రణకు కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఎంతో డ్రగ్ పెడ్లర్లతో పాటు వినియోగిస్తున్న వారినీ అదుపులోకి తీసుకుని కేసులు పెట్టామని వెల్లడించారు. సీతక్క మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల మాఫియా ప్రపంచాన్ని గడగడలాడించి, కోట్లు కొల్లగొడుతోందన్నారు. మాదకద్రవ్యాల మత్తులో లైంగిక దాడులు, హత్యలు చేస్తున్నారని, పెద్దపల్లిలో చిన్నారిపై లైంగికదాడి హత్య ఘటన మనసును కలవరపెట్టిందన్నారు. డ్రగ్స్ అనర్థాలపై మెగాస్టార్ చిరంజీవి సందేశంతో కూడిన వీడియో, పాటను మంత్రులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీజీపీ రవి గుప్తా, మాజీ క్రికెటర్ మిథాలీరాజ్, సినీ నటులు సుమన్, తేజా సజ్జా, గాయకుడు రామ్ మిరియాల, అధికారులు పాల్గొన్నారు.

ఐటీఐఆర్ మంజూరు చేసే వరకు మాట్లాడుతూనే ఉంటా

» కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లను కలుస్తా

» ప్రతిపక్షంగా మా బాధ్యత మేము నిర్వహిస్తాం

» కాంగ్రెస్ ఐటీఐఆర్ మంజూరు చేసినప్పుడు.. రఘునందన్ రావు బీఆర్ఎస్‌లో ఉన్నడు

» నాకష్టంతోనే నేను ఎదిగా: తూర్పు జగ్గారెడ్డి



గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న జగ్గారెడ్డి

హైదరాబాద్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం హైదరాబాద్‌కు ఐటీఐఆర్‌ను మంజూరు చేసే వరకూ దానిపై మాట్లాడుతూనే ఉంటానని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి స్పష్టం చేశారు. పార్లమెంటు సమావేశాలు అయిపోయిన తర్వాత కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌ను కలిసి వినతిపత్రం ఇస్తానని, రద్దయిన ఐటీఐఆర్‌ను తిరిగి తీసుకురావాలని కోరతానని వెల్లడించారు. ప్రతిపక్షం తరఫున తమ బాధ్యత నిర్వర్తిస్తామని వెల్లడించారు. గాంధీభవన్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో 14 ఎంపీ సీట్లు కాంగ్రెస్‌కు వచ్చుంటే.. రాహుల్‌గాంధీ ప్రధాని అయ్యేందుకు అవకాశం ఉండేదేమోనన్నారు. అప్పుడు తామంతా రాహుల్ దగ్గర కూర్చుని హైదరాబాద్‌కు తిరిగి ఐటీఐఆర్‌ను మంజూరు చేయించుకుని ఉండేవాళ్లమని పేర్కొన్నారు. హైదరాబాద్‌కు సోనియా, మన్మోహన్‌సింగ్ ఇచ్చిన ఐటీఐఆర్‌ను మోదీ ప్రభుత్వం రద్దు చేయకుండా ఉంటే రాష్ట్రంలోని యువతకు ఈ పదేళ్లలో సుమారు 15లక్షల ఉద్యోగాలు వచ్చుండేవన్నారు. ఆ ప్రాజెక్టు అమలై ఉంటే సెజ్‌లు, ఇండస్ట్రియల్ పార్కులు, ట్రేడ్, వేర్ హౌస్ జోన్లు, ఎక్స్‌పోర్టు ఓరియెంటెడ్ యూనిట్లు హైదరాబాద్‌లో విస్తరించి ఉండేవని పేర్కొన్నారు. ప్రభుత్వానికీ పెద్ద ఎత్తున ఆదాయం సమకూరి ఉండేదన్నారు. ఇంత గొప్ప ప్రాజెక్టును ఎన్డీయే ప్రభుత్వం నిలిపేయడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రం నుంచి ఎన్నికైన 8మంది బీజేపీ ఎంపీలు ప్రత్యేకంగా దృష్టి పెట్టి ఐటీఐఆర్‌ను తిరిగి తెచ్చేందుకు కృషి చేయాలని కోరారు.

నా కష్టంమ్మీద నేను ఎదిగా

"ఐటీఐఆర్ గురించి నాకు అఆలు కూడా తెలియవని బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు అంటున్నారు. ఎడ్యుకేషన్‌పరంగా నేను వీక్ అయుండొచ్చు. ఇంటర్ ఫెయిల్ అయ్యాను కూడా. రఘునందన్‌రావు పుస్తకాలు చదివితే.. నేను జీవితాన్ని చదివిన. పుస్తకాల్లో ఎవరో రాసింది ఉంటది. మెరిట్ స్టూడెంట్‌కు అనుభవాలు ఉండవు. జీవితాన్ని చదివిన వాడికి కష్టాలు, అనుభవాలు ఉంటయి" అని జగ్గారెడ్డి అన్నారు. తల్లిపాలు తాగి రొమ్ము గుద్దిండంటూ తనపై రఘునందన్‌రావు విమర్శలు చేస్తుండని, కానీ ఇక్కడ తల్లి పాత్రే తనదన్న సంగతి ఆయన తెలుసుకోవాలన్నారు. తన చిన్నతనంలో తమ దగ్గర ఆరెస్సెస్ శాఖలు నడుస్తుంటే.. పిల్లలమైన తాము గంట సేపు ఆడుకుని ప్రచారక్‌లు ఏదో చెబితే విని వస్తుండేవాళ్లమని చెప్పారు. రఘునందన్‌రావు బీజేపీలోకి డైరెక్టుగా వచ్చిండు కాబట్టి ఆ శాఖల గురించి ఆయనకు తెలియదన్నారు. ఐటీఐఆర్ మంజూరు చేసినప్పుడు ఆయన బీఆర్ఎస్‌లోనే ఉన్నారన్నారు. తన కష్టం మీద, తన తల్లి ప్రోత్సాహంతో తాను ఎదిగానని చెప్పారు. ప్రజా సమస్యలపై పోరాటాలు చేసి జైలుకూ వెళ్లానన్నారు. తన జోలికి వస్తే బీజేపీలో ఉండే కుళ్లు, కుతంత్రాలు చర్చకు పెడతానని హెచ్చరించారు.

ప్రాణాలు తీస్తున్న మద్యం

» 2019లో ప్రపంచ వ్యాప్తంగా 26 లక్షల మరణాలు

» ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక

హైదరాబాద్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మద్యం పానం ప్రజారోగ్యంపై తీవ్ర దుష్ప్రభావం చూపిస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా లక్షల సంఖ్యలో మరణాలకు కారణమవుతోంది. 'గ్లోబల్ స్టేటస్ రిపోర్టు ఆన్ ఆల్కహాల్ అండ్ హెల్త్ అండ్ ట్రీట్మెంట్ ఆఫ్ సబ్‌స్టాన్స్ యూజ్ డిజార్డర్' పేరిట ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) ఇటీవల విడుదల చేసిన నివేదిక ఈ విషయాన్ని స్పష్టం చేసింది. మద్యం వినియోగానికి సంబంధించి 2019 నాటికి ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాల నుంచి సేకరించిన గణాంకాల ఆధారంగా డబ్ల్యూహెచ్‌వో ఈ నివేదిక రూపొందించింది. దీని ప్రకారం 2019 నాటికి ప్రపంచవ్యాప్తంగా 40 కోట్ల మంది ఆల్కహాల్, మాదక ద్రవ్యాల వినియోగ రుగ్మతతో జీవిస్తున్నారు. వీరిలో 20.9కోట్ల మంది మందుబాబులు ఉన్నారు. మద్యపానం వల్ల కలిగే అనారోగ్యాల వల్ల 2019లో ప్రపంచ వ్యాప్తంగా 26 లక్షల మరణాలు సంభవించాయి. మొత్తం మృతుల్లో 20 లక్షల మంది పురుషులే ఉండడం గమనార్హం. అంతేకాక, మరణించిన వారిలో 20-39 ఏళ్ల లోపు వారే అత్యధికంగా ఉన్నారు. భారత్ విషయానికొస్తే 2019 నాటికి దేశ జనాభాలో 31 శాతం మంది మద్యపానం చేసే వారున్నారు. దేశంలోని పురుషుల్లో 40.9 శాతం మంది, మహిళల్లో 20.8 శాతం మంది మద్యపానం చేసేవారున్నారు. మద్యపానం వల్ల మరణించిన వారి సంఖ్యలోనైతే భారత్ ఏకంగా చైనాను అధిగమించింది. భారత్‌లోని ప్రతీ లక్ష మంది జనాభాలో 38 మంది మద్యం వల్ల మరణిస్తే చైనాలో ఈ సంఖ్య కేవలం 16గా ఉంది. కాగా, మద్యం మత్తులో వాహనాలు నడపడం వల్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ప్రపంచవ్యాప్తంగా 2.98 లక్షల మంది మృత్యువాత పడ్డారు. కాగా, 2019 నాటికి ప్రపంచవ్యాప్తంగా తలసరి మద్యం వినియోగం 5.5 లీటర్లు(ఏడాదికి ఒక వ్యక్తి తాగే మద్యం)గా ఉంది. భారత్‌లో ఇది 4.9 లీటర్లుగా ఉండగా 2030 నాటికి అది 6.7 లీటర్లకు చేరనుందని డబ్ల్యూహెచ్‌వో అంచనా వేసింది.

మహిపాల్‌రెడ్డి చూపు.. బీజేపీ వైపు?

కమలం గూటికి చేరనున్న పటాన్‌చెరు ఎమ్మెల్యే?

» ఈడీ తనిఖీలతో ఆందోళనలో బీఆర్ఎస్ నేత?

» ఢిల్లీకి రహస్య టూర్



పటాన్‌చెరు, జూన్ 26: బీఆర్ఎస్‌కు మరో షాక్ తగలనుందా? పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి బీజేపీలో చేరుతారా? ఇటీవల ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) జరిపిన తనిఖీల నేపథ్యంలో ఈ నిర్ణయానికి వచ్చారా? అంటే.. మహిపాల్‌రెడ్డి ఆకస్మికంగా ఢిల్లీ పర్యటనకు వెళ్లడంతో ఈ అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బుధవారం జహీరాబాద్ మాజీ ఎంపీ, బీజేపీ నాయకుడు బీబీ పాటిల్‌తో మహిపాల్‌రెడ్డి సమావేశం కావడం కూడా ఆయన బీజేపీ వైపు అడుగులు వేస్తున్నారన్న అభిప్రాయాన్ని కలిగిస్తున్నాయి. అయితే గతంలో బీఆర్ఎస్ తరఫున రెండుసార్లు జహీరాబాద్ ఎంపీగా పనిచేసిన బీబీ పాటిల్‌తో మహిపాల్‌రెడ్డికి సన్నిహిత సంబంధాలున్నందున.. ఆ చనువుతో ఆయనను కలిశారనే అభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి. కానీ, గత పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్ రావు పటాన్‌చెరు నియోజకవర్గంలో లక్ష పైచిలుకు ఓట్లు సాధించడంతో.. ఓటుబ్యాంకు బీజేపీ వైపు మళ్లిందన్న సంకేతాలు కనిపించాయి. బీఆర్ఎస్ ఏకంగా మూడో స్థానానికి పడిపోవడంతో తమ రాజకీయ భవిష్యత్తు ఏమిటన్న ప్రశ్న స్థానిక బీఆర్ఎస్ నేతల మెదళ్లను తొలుస్తోంది. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో సైతం ఇదే ఫలితాలు వస్తే కేడర్ మిగలదన్న భావన వ్యక్తమవుతోంది. అయితే ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తొలుత కాంగ్రెస్‌లో చేరతారని ప్రచారం జరిగినా.. ఈడీ సోదాల తరువాత పరిణామాలు వేగంగా మారిపోయాయి. పటాన్‌చెరు నియోజకవర్గంలో తన ప్రధాన అనుచరులుగా చెప్పుకొనే వారికి సైతం చెప్పకుండా ఆయన ఢిల్లీకి వెళ్లారు. కేవలం కేసు పనిమీద న్యాయవాదులను కలిసేందుకు వెళ్లినట్లు ఆయన అనుచరులు చెబుతున్నా.. బీజేపీ నేత బీబీ పాటిల్‌తో మంతనాలకు సంబంధించి మాత్రం సమాధానం కరువైంది. అంతేకాకుండా బీజేపీ సంగారెడ్డి జిల్లా ముఖ్యనాయకుడు సైతం ఎమ్మెల్యే వెంట వెళ్లడం అనుమానాలు మరింత బలపడేలా చేస్తోంది.

కాంగ్రెస్ చేరేందుకు స్థానికంగా వ్యతిరేకత

మహిపాల్‌రెడ్డి తొలుత కాంగ్రెస్‌లో చేరేందుకే ప్రయత్నాలు చేశారని, కానీ.. ఆయన ప్రయత్నాలను స్థానిక కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా వ్యతిరేకించడంతో వెనక్కి తగ్గారని సమాచారం. నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్‌గౌడ్, మెదక్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసి రెండో స్థానంలో నిలిచిన నీలం మధు ముదిరాజ్.. ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి చేరికను వ్యతిరేకించినట్లు తెలిసింది. మరోవైపు మహిపాల్‌రెడ్డి, ఆయన సోదరుడు మధుసూదన్‌రెడ్డి ఇళ్లు, కార్యాలయాల్లో ఈడీ అధికారులు ఇటీవల తనిఖీ చేసి పెద్ద ఎత్తున స్థిరాస్తులకు సంబంధించిన డాక్యుమెంట్లు, నగదును స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. దీంతోపాటు బినామీలుగా భావిస్తున్న కొందరిని ఈడీ కార్యాలయానికి పిలిపించి అక్రమాస్తులపై ఆరా తీస్తున్నట్లు సమాచారం. కిష్టారెడ్డిపేట గ్రామానికి చెందిన ఓ బిల్డర్ మధుసూదన్‌రెడ్డికి బినామీగా వ్యవహరిస్తున్నట్లు ఆధారాలు లభ్యం కావడంతో ఆయన నుంచి వివరణ అడిగారు. మిగతా బినామీ వ్యక్తులు ఈడీ నుంచి తప్పించుకునేందుకు నానా పాట్లు పడుతున్నారని తెలిసింది. ఎవరికి ఎప్పుడు ఈడీ నుంచి పిలుపు వస్తుందో, ఎవరి ఇళ్లలో సోదాలు చేస్తారోనన్న భయంతో వారు బిక్కుబిక్కుమంటున్నారు.

6 నెలల్లో అన్నీ తారుమారవుతాయి

(మొదటి పేజీ తరువాయి)

చూస్తున్నారన్న మాటలు కార్యకర్తల నుంచి వినిపిస్తున్నాయి. ఈ తరుణంలో ఆయన కేసీఆర్‌ను కలవడంతో ఆ ఊహాగానాలకు తెరపడినట్టేనని కొందరు భావిస్తుండగా, మరికొందరు నాయకులు మాత్రం పార్టీ మారే అవకాశాలను కొట్టిపారేయలేమని వాదిస్తున్నారు. ఐదుగురు ఎమ్మెల్యేలు కేసీఆర్‌ను కలిసి చర్చలు జరిపినప్పుడు మాజీ మంత్రి హరీశ్‌రావు కూడా ఉన్నట్లు సమాచారం. లక్ష్మారెడ్డి వెంట నియోజకవర్గ నాయకులు తరలివెళ్లారు. నాయకులందరూ కేసీఆర్‌తో ఫొటోలు దిగిన అనంతరం అక్కడే భోజనాలు చేశారు. ఆయనను కలిసిన వారిలో మాజీ మంత్రులు వేముల ప్రశాంత్ రెడ్డి, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్సీ తాతామధు, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్ రెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి తదితరులు ఉన్నారు. వారితో కేసీఆర్ సుదీర్ఘంగా చర్చించారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు దాదాపు ఐదు గంటల పాటు కేసీఆర్ ఫాంహౌస్‌కు వచ్చిన కార్యకర్తలను కలిశారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



ఎల్లారెడ్డిలో మత్తు పదార్థాలపై అవగాహన ర్యాలీ



ర్యాలీలో బాన్సువాడ సివిల్ న్యాయాధికారి

ఎల్లారెడ్డి, జూన్ 26: ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో బుధవారం పోలీస్ శాఖ, ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా విద్యార్థులతోకలిసి అంబేద్కర్‌చౌరస్తా నుంచి గాంధీచౌక్‌వరకు అవగాహనర్యాలీ నిర్వ హించారు. పట్టణ కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు విద్యార్థులతో కలిసి మాదక ద్రవ్యాలు విని యోగానికి ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని మత్తు పదార్థాలకు బానిసలు కాకూడదని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతీ ఒక్కరు ఉద్యమించాల్సిన అవసరం ఉందని అదే విధంగా పాఠ్య పుస్తకాలలో పొందుపరచాలని అన్నారు. ప్రతి కుటుంబంలో ప్రతి ఒక్కరూ మాదక ద్రవ్యాలు సేవిస్తే వాటి వల్ల కలిగే అనార్థలపై అవగాహన కలిగి ఉండాలని, మాదక ద్రవ్యాలు సేవించడం వల్ల అనేక అనారోగ్యాలకు గురవడమే కాకుండా ఆర్థికం గా ఇబ్బందులకు గురవుతారని, ప్రతి ఒక్కరు గుర్తుంచుకోవాలని సూచించారు. దేశ ప్రధానమంత్రి నరేంద్రమోది, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాదక ద్రవ్యాలపై ఉక్కుపాదం మోపుతున్నారని దానికి అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ షాకీర్ అహ్మద్, పోలీసు సిబ్బంది ఎక్సైజ్ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

బాన్సువాడటౌన్: బాన్సువాడ పట్టణంలో బుధవారం మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు.బాన్సువాడ సివిల్ కోర్టు న్యాయాధికారి కుమారి టీఎస్ భార్గవి మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవంలో పాల్గొని అవగాహన ర్యాలీ నిర్వహించారు. మాదకద్రవ్యాల వినియోగాన్ని ఆపడానికి సహకరిస్తామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం స్థానిక కోర్టు ప్రాంగణం నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ ప్రధాన రహదారి గుండా సాగింది.న్యాయవాదులు డ్రగ్స్ వద్దు ఆరోగ్యమే ముద్దు అనే నినాదాలతో పట్టణమంతా హోరెత్తించారు.ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ మున్నూరు కృష్ణ, బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణమూర్తి, న్యాయవాదులు రమాకాంత్‌రావు, ఖలీల్, మొగులయ్య, దత్తాత్రేయ, హమీద్, అజీం, కోర్టు సిబ్బంది తదితరులున్నారు.

బీర్కూర్: ప్రపంచ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం బీర్కూర్ మండలం బైరాపూర్ గ్రామంలో గ్రామస్తులకు అవగాహన కల్పించారు.యువతలో పెరుగుతున్నమాదక ద్రవ్యాలవ్యసనం, దానివల్ల కలిగే దుష్పరిణామాలను వైద్య సిబ్బందిప్రజలకు వివరించారు. తల్లిదండ్రులు తమ పిల్లలపై ఒక కన్నేసి ఉంచాలని, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండేలా చూడాలన్నారు.

బిచ్కుంద: మత్తుపదార్థాలకు బానిసవ్వకుండా అలాంటి వాటికి దూరంగా ఉండాలని బిచ్కుంద సీఐ నరేష్ అన్నారు. బుధవారం అంతర్జాతీయ మత్తుపదార్థాల వ్యతిరేక దినం సందర్భంగా బిచ్కుంద పోలీసులు ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా గంజాయి,డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాలకు బానిసవ్వకుండా దూరంగా ఉంటూ ఎవరైనా రవాణా చేస్తే వాటి సమాచారాన్ని పోలీసులకు ఇవ్వాలని తెలిపారు. పట్టణంలోని పాతబస్టాండ్, అంబేద్కర్ చౌరస్తా,కొత్తబస్టాండ్ ప్రధాన వీధులలో మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ప్రచారం నిర్వహిస్తు ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో బిచ్కుంద ఎస్ఐ మోహన్‌రెడ్డి, పోలీసుసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

ప్రశాంతంగా ముగిసిన ఏబీవీపీ బంద్



భిక్కనూరులో పాఠశాలను మూసివేస్తున్న దృశ్యం

కామారెడ్డిటౌన్, జూన్26: ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల అక్రమఫీజులను అరికట్టి ఫీజు నియంత్రణ చట్టం తీసుకురావాలని ఏబీవీపీ ఇచ్చిన బంద్‌బుధవారం ప్రశాంతంగా ముగిసింది.ఈ సందర్భంగా ఏబీవీపీ జిల్లా కన్వీనర్ రోహిత్ మాట్లాడుతూ ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, ప్రైవేట్ పాఠశాలలో 25 శాతం పేద విద్యార్థులకు సీట్లు కేటాయించాలని అటెండర్‌లు,స్కావెంజర్లను నియమించాలని అన్నారు. పర్మిషన్లు లేకుండా నడుస్తున్నటువంటి స్కూల్‌లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ పాఠశాల బంద్‌కు పిలుపునిచ్చిందని తెలిపారు.

ఎల్లారెడ్డి: ఏబీవీపీ బంద్ పిలుపు మేరకు ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని ప్రైవేట్ ప్రభుత్వ పాఠశాలలు బంద్ పాటించాయి. ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకుడు జాషువా మాట్లాడుతూ ప్రైవేట్ కార్పొరేట్ ఇంటర్నేషనల్ పాఠశాలలో అక్రమంగా ఫీజులు వసూలు చేస్తున్న యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఫీజు నియంత్రణ చట్టం వెంటనే అమలు చేయాలని, ఇబ్బందులకు వ్యతిరేకంగా పాఠశాలలో పుస్తకాలు యూనిఫామ్ అమ్ముతున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని, నిబంధనలు పాటించని పాఠశాలలకు గుర్తింపును రద్దు చేయాలని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత లేకుండా చూడాలని డిమాండ్ చేశారు.

బాన్సువాడటౌన్: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి , ప్రైవేటు పాఠశాలల్లో ఫీజులను నియంత్రించాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో తలపెట్టిన పాఠశాలల బంద్ విజయవంతమైంది. ఏబీవీపీ నాయకులు పాఠశాలలకు వెళ్లి తరగతులను బహిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో కనీస వసతులు లేక విద్యార్థులు నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. అంతేకాకుండా ప్రైవేటు పాఠశాలల్లో విద్యను వ్యాపారంగా చేసి ఫీజులు ఇష్టారీతిన పెంచుతున్నారని, ఫీజు నియంత్రణ చట్టాన్ని తక్షణమే అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను, డీఈవో, ఎంఈవో పోస్టులను భర్తీ చేయాలన్నారు. గుర్తింపు లేని పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా ఎస్ఎఫ్‌డి కన్వీనర్ గూడెం శ్రీకాంత్, ప్రమోద్, వెంకటేశ్, గంగాధర్ , విజయ్, కార్తీక్, అశోక్, ప్రవీణ్ తదితరులున్నారు.

భిక్కనూరు: ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంతో పాటుగా అధిక ఫీజులు వసూళ్లు చేస్తున్న ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏబీవీపీ నిర్వహించిన పాఠశాలల బంద్ కార్యక్రమం భిక్కనూరులో బుధవారం విజయవంతమైంది. ఈసందర్భంగా ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల వద్దకు వెళ్లి ఏబీవీపీ నాయకులు పాఠశాలలను బంద్ చేయించారు.

అనంతరం ఏబీవీపీ కామారెడ్డి ఎస్ఎఫ్ఎస్ ఇన్‌చార్జి గంధం సంజయ్ మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజులు వసూళ్లు చేస్తున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని, ఫీజు నియంత్రణ చట్టాలని అమలు చేయాలని, ప్రభుత్వ పాఠశాలల్లోని సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ ప్రతినిధులు సమీర్‌ఖాన్, శివకృష్ణ, చందు, దత్తాత్రేయ, యోగేష్, నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

మద్నూర్: విద్యార్థుల డిమాండ్ల సాధన కోసం అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని పాఠశాలలను బంద్ చేయించారు. ప్రైవేట్ పాఠశాలలో ఫీజు నియంత్రణ చట్టం వెంటనే అమలు చేయాలని, నిబంధనలకు వ్యతిరేకంగా ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల్లో బుక్స్ యూనిఫామ్స్ అమ్ముతున్న యాజమాన్యంపైన కఠిన చర్యలు తీసుకోవాలని, గుర్తింపు, నిబంధనలను పాటించని ప్రైవేట్ పాఠశాలల గుర్తింపు రద్దు చేయా లని, పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత లేకుండా చూడాలని వెంటనే డీఈవో, ఎంఈవో అధికారులను నియమించాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజనం లో జరుగుతున్న అవకతవకలపై విచారణ జరిపి నాణ్యత లేని ఆహారాన్ని అందిస్తున్న అధికారులపైన చర్యలు తీసుకోవాలని కోరారు. మెగా డీఎస్సీ ద్వారా 24 వేల ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులు భర్తీ చేయాలని కోరారు. ప్రభుత్వ పాఠ శాలలో అటెండర్ మరియు స్కావెంజర్లను వెంటనే నియమించాలని డిమాండ్ చేశారు. విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. పై డిమా ండ్లను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని అందుకు నిరసనగా పాఠశాలలను బంద్ చేయి స్తున్నట్లు ఏబీవీపీ నాయకులు తెలిపారు.

బీర్కూర్ ప్రభుత్వ పాఠశాల ఎదుట ఏబీవీపీ ధర్నా



ప్రభుత్వ పాఠశాల ఎదుట ధర్నా చేస్తున్న ఏబీవీపీ నాయకులు

బీర్కూర్, జూన్ 26 : ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఏబీవీపీ నాయకులు బీర్కూర్ మండలంలో ప్రభుత్వ పాఠశాలలను బంద్ చేయించారు. అనంతరం బీర్కూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకులు మాట్లాడుతూ ఏబీవీపీ రాష్ట్రశాఖ పిలుపు మేరకు పాఠశాలలను బంద్ చేయించామన్నారు. ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వ పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకున్న పాపా నపోవడం లేదని విమర్శించారు. ఒక వైపు ప్రభుత్వ పాఠశాలల్లో సరైన వసతులు లేక అధ్యాపకులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, మరో వైపు ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు లక్షలకు లక్షలు ఫీజులు దండుకుంటున్నా ప్రభుత్వం చూసి చూడనట్లు వ్యవహరిస్తుం డటం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్క రిం చడంతో పాటు సరైన వసతులు కల్పించాలని డిమాండ్ చే శారు.ప్రైవేట్ పాఠశా లలో నిబంధనలకు విరుద్ధంగాబుక్‌లు, యూనిఫాంలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.ఏబీవీపీ డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఎన్‌సీసీ సర్టిఫికెట్ల అందజేత

భిక్కనూరు, జూన్ 26: భిక్కనూరు మండలంలోని పెద్దమల్లారెడ్డి బాలుర ఉన్నత పాఠశాలలో ఎన్‌సీసీ విద్యార్థులకు బుధవారం పాఠశాల హెచ్ఎం ప్రసూన దేవి, ఎంపీటీసీ సాయాగౌడ్ ఏ సర్టిఫికెట్లను అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్‌సీసీలో చేరిన విద్యార్థులు ఎంతో క్రమశిక్షణతో ఉంటారని అన్నారు. అనంతరం గ్రామంలో ఎన్‌సీసీ విద్యార్థులుమాదక ద్రవ్యాల వ్యతిరేకదినోత్సవాన్ని పురస్కరించుకుని ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్ సీసీ అధికారి అనీల్‌కుమార్,పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

సదాశివనగర్, జూన్ 26:మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి పీఎసీఎస్‌లో యశోద హస్పిటల్, సేవాస్ఫూర్తి ఫౌండేషన్ సహకారంతో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఇందులో బీపీ,షుగర్ పరీక్షలు చేయించి వైద్యులువారికి సలహాలు సూచనలు చేసి మందులు అందించారు.అవసరమైనవారికి ఈసీజీ, టూడీకో పరీక్షలు చేయించారు.ఈ కార్యక్ర మంలో జిల్లా వ్యవసాయాధికారి భాగ్యలక్ష్మీ, సొసైటీ చైర్మన్ సదాశివరెడ్డి ఉన్నారు.

మహిళా స్వశక్తి లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న వకుళాదేవి

నాగిరెడ్డిపేట, జూన్ 26: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన మహిళా స్వశక్తి కేంద్రాలకు అర్హత గల లబ్ధిదారులను గుర్తించాలని మహిళల జీవితాలలో వెలుగు నింపాలని సెర్ప్ డీపీఎం వకుళాదేవి వీవోఏలను కోరారు. బుధవారం మండల సమాఖ్య కార్యాలయంలో జరిగిన వీవోఏల సమీక్ష సమావేశంకు ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడు తూ బ్యాంకు లింకేజీ, స్త్రీ నిధి ద్వారా మహిళా సంఘాలకు రుణాలు ఇప్పించి మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు వీవోఏలు కృషి చేయాలన్నారు. సంఘాల లోకోస్ డాటా ఎంట్రీ త్వరితగతిన పూర్తి చేసి ప్రతి నెలా సంఘాల అకౌంటింగ్ సకాలంలో పూర్తి చేయాలని ఏపీఎం జగదీష్‌కుమార్‌ను కోరారు. పీఎంఈజీపీ స్కీం ద్వారా 35 శాతం సబ్సిడీతో వివిధ వ్యాపారాలు చేయుటకు మహిళా సంఘాలలో ఆసక్తి ఉన్న సభ్యులను గుర్తించి వారికి శిక్షణ ఇప్పించాలని, వారికి జీవనోపాధి కల్పించాలని కోరారు. స్త్రీ నిధి రుణాల మొండి బకాయిలను రికవరీ చేసి కొత్త రుణాలు ఇవ్వాలని స్త్రీనిధి రీజనల్ మేనేజర్ కిరణ్‌కుమార్ కోరారు. వీవోఏలు సంఘాల సభ్యులకు అందుబాటులో ఉండి ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలు, ప్రయోజనాలు సంఘ సభ్యులకు చేరే విధంగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు బెస్తశాంత, రాజేందర్, సీసీలు దత్తు, నారాయణ, రమేష్, సాయిలు, రషీద్, శ్రీనివాస్‌రెడ్డి, సుజాత, మండల సమైక్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు వ్యక్తిత్వ నైపుణ్యతను పెంచుకోవాలి

● జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్ రావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్ రావు, హాజరైన విద్యార్థులు

నిజాంసాగర్, జూన్ 26: విద్యార్థులు వ్యక్తిత్వ వికాసం, నైపుణ్యతను పెంపొం దించుకోవాలని, ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు, వసతులను సద్వినియోగం చేసుకోవాలని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్ రావు అన్నారు. బుధవారం నిజాంసాగర్ మండల కేంద్రంలోని (కేజీబీవీ) కస్తూర్బా గాంధీ బాలికల విద్యాల యంలో విద్యార్థినీలకు పాఠ్య పుస్తకాలు, యూనిఫాంలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయనకు విద్యార్థినీలు, ఉపాధ్యాయులు ఘనంగా స్వా గతం పలి కారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకుమెరుగైన విద్యను అందిం చడం కోసం పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు పుస్తకా లు, యూనిఫాం, బోజన సౌకర్యాలు కల్పిస్తున్నారన్నారు. విద్యార్థులు ఈ అవకా శాన్ని సద్వినియోగంచేసుకుని బాగా చదువుకోవాలని సూచించారు.మంచి మార్కులు సాధించడమే లక్ష్యంగా చదువులు కొనసాగించడంతో పాటు వ్యక్తిత్వ వికాసం, నై పుణ్యతను పెంపొందించుకోవాలన్నారు.ఈ కార్యక్ర మంలో నిజాం సాగర్, మహ్మద్ నగర్ మండలాల పార్టీ అధ్యక్షులు మల్లికార్జున్, రవీందర్ రెడ్డి, సవాయి సింగ్, జయ ప్రదీప్, ఎంఈవో దేవిసింగ్, ప్రత్యేకాధి కారిణి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ చంద్రముఖర్జీ

మద్నూర్,జూన్26 : మద్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024 - 25 విద్యా సంవత్సరానికి గాను కోర్సుల్లో అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతుందని ప్రొఫెసర్ చంద్రముఖర్జీ తెలిపారు. ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల అయిన సందర్భంలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు డిగ్రీ మొదటి సంవత్సరంలోని బీఏ, బీకాం, బీఎస్సీ, ఎంపీసీ, బీజెడ్‌సీ, కంప్యూటర్ కోర్సుల్లో అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతుం దని తెలిపారు. 3వ ఫేస్ రిజిస్ట్రేషన్ తేది జూలై 2 వరకు ఆన్‌లైన్ దర ఖాస్తులు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9492795524, 9701155512 మొబైల్ నెంబర్లకు ఫోన్ చేసి సంప్ర దించాలని అన్నారు.

వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచుతాం

'ఆంధ్రజ్యోతి'లో కథనానికి అధికారుల స్పందన | ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



దోమకొండలో శునకానికి ఇంజక్షన్ వేస్తున్న వెటర్నరీ వైద్యుడు

దోమకొండ, జూన్ 26:మండల కేంద్రంలోని పశువైద్యశాలలో బుధవారం పశువైద్యాధికారి శివ పశువులకు, శునకాలకు చికిత్సలు అందించారు. 'పశు వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచుతాం' అనే వార్త 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైంది. ఈ వార్తకు జిల్లా అధికారులు స్పందించారు. జడ్పీటీసీ, రైతులు అబ్రబోయిన రాజేందర్, కొండ, అంజం, చిన్నోల్ల లింగం పశువైద్యశాలకు చేరుకుని అధికారులకు పలు విషయాలను వివరించారు. ఈ సందర్భంగా ఏడీ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రస్తుతం దోమకొండలో సిబ్బందిని అందుబాటులో ఉంచాడానికి ప్రణాళిక తయారు చేస్తున్నామని నూతనంగా పోస్టు నియమించడానికి ఆదేశాలు లేవని, జేడి ఆదేశాల మేరకు ఇతర ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందిని దోమకొండ పశువైద్యశాలలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పారిశుధ్య లోపంతో ఒకరికి డెంగీ



లింగంపేటలో డెంగ్యూ వాదితో చికిత్సపొందుతున్న సాయికృష్ణ

లింగంపేట, జూన్ 26 : లింగంపేట మండల కేంద్రంలోని 7వ వార్డులో పోకల సాయి కృష్ణకు డెంగీ వ్యాధి సోకినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గత మూడు రోజులుగా ప్లేట్ లెట్స్ తగ్గిపోవడంతో మండల కేంద్రంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మండల కేంద్రంలో పారిశుధ్య లోపంతో వ్యాధులు ప్రబలుతున్నాయని అధికా రులు పట్టించుకోవడం లేదని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. డ్రైనేజీలు నిండిపోయి కంపు కొడుతున్నా పట్టించుకునేవారు కరువయ్యారని, పారిశుధ్యలోపంతో పలు కాలనీలలో మురికి నీరు రోడ్లపై పారుతుందని వారు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం ప్రారం భమైనా ఇంత వరకు ఎలాంటి నివారణ చర్యలు చేపట్టక పోవడంతో దోమలు పెరిగిపోయాయని వారు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలనీలలో పరిశుధ్య పనులు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

అంగన్‌వాడీ టీచర్ల శిక్షణ కేంద్రాన్ని సందర్శించిన ఆర్డీవో



అంగన్‌వాడీ శిక్షణ కేంద్రంలో మాట్లాడుతున్న ఆర్డీవో

ఎల్లారెడ్డి,జూన్ 26:ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని రైతు శిక్షణ కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్లకు ఇస్తున్న శిక్షణ కేంద్రాన్ని బుధవారం ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నె ప్రభాకర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయిలో పిల్లలకు పునాది రాయిగా ఉండాల్సిన బాధ్యత అంగన్‌వాడీ టీచర్లపై ఉందని అన్నారు. పూర్వ ప్రాథమిక విద్య అనేది పిల్లల భవిష్యత్తుకు ఒక ఎంతో ఉపయోగపడుతుందన్నారు.అనంతరం అజయ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ ట్రైనర్‌కృష్ణ మాట్లాడుతూ పూర్వప్రాథమిక విద్య అవసరాన్ని నూతన విద్యావిధానాన్ని చిన్నారులలో అభివృద్ధిదశల గురించి వివరించి అంగన్ వాడీ టీచర్లు శిక్షణలో నేర్చుకున్న అంశాలను బోధన పద్ధతుల ను అడిగి తెలుసుకున్నారు.ఈకార్యక్రమంలో సీడీపీవో సరిత, మాస్టర్ ట్రైనర్స్ స్వరూప, హరిత, సూపర్ వైజర్లులతా, భారతి,వినోదిని, ఈశ్వరీబాయి తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్‌మేకింగ్,కవితారచన పోటీలు

కామారెడ్డిటౌన్, జూన్26:ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పాఠశాల(8,9 తరగతి) విద్యార్థులకు పోస్టర్ మేకింగ్, కవితా రచనలలో జిల్లా స్థాయి పోటీలు నిర్వహించబడునని డీఈవో రాజు ఒక ప్రకటనలో తెలిపారు.ఈపోటీలు జిల్లా కేంద్రంలోని హౌజింగ్‌బోర్డు కాలనీలోని భవిత పాఠశాలలో ఈనెల 29న ఉదయం 10 గంటల నుంచి నిర్వహించబడునని తెలిపారు. ఒక విద్యార్థి రెండు పోటీలలో పాల్గొనడానికి అవకాశం ఉండదని తెలిపారు.ఈపోటీలలో విజయం సాధించిన విద్యార్థులకు మెమోంటోలు,సర్టిఫికేట్లుఅందజేయబడతాయని ఇతర వివరాలకుఎన్‌జీసీ జిల్లా సమన్వయకర్త, జిలా సైన్‌అధికారి సిద్ధి రాంరెడ్డిని సంప్రదించాలని కోరారు.

ఎల్‌ఓసీ అందజేత

మాచారెడ్డి, జూన్ 26:మండలంలోని లచ్చపేట గ్రామంలోని జక్కుల జ్యోతి ఆపరేషన్ నిమిత్తం రూ.2లక్షల 50 వేలను ఎమ్మెల్యే వెంకటరమణరెడ్డి ఎల్‌ఓసీ అందించారు.ఈ ఎల్ ఓసీ పత్రాన్ని బుధవారం మండల అధ్యక్షుడు భూసనురేష్,మండల కోశాధికారి ప్రభాకర్‌లు బాధితురాలికి అందించారు.ఈ కార్యక్రమంలో చల్ల లింగం,అనిల్,ఎల్లం,భూపతి, ప్రశాంత్ పాల్గొన్నారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీ నెరవేర్చాకే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి

మాచారెడ్డి, జూన్ 26: ఎన్నికల్లో ఇచ్చిన హామీ నెరవేర్చాకే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని ఎంసీపీఐయూ మండలకార్యదర్శి లాలబోయిన శేఖర్ అన్నారు.బుధవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఆరుగ్యారెంటీలు అమలుచే స్తామని చెప్పి రెండు మాత్రమే అమలుచేసి చేతులు దులుపుకుం దని అన్నారు.ఇప్పటికే మహిళలకు ఇస్తున్న రూ.2500లు, వృద్ధులకు ఇస్తున్న పెన్షన్ అలాగే రుణమాఫీ విషయంలో ఎటువంటి స్పష్టత లేదని అన్నారు.ఈ కార్యక్రమంలో రవి, లక్ష్మీ,పోశవ్వ తదితరులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డు మంజూరు

రామారెడ్డి, జూన్ 26: మండలంలోని ఉప్పల్‌వాయి నుండి మోషంపూర్ మధ్యగల బీటీరోడ్డు మంజూరు ఘనత మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్‌దని ఎంపీపీ నారెడ్డి దశరథ్‌రెడ్డి అన్నారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు మాజీ ఎమ్మెల్యే కృషి ఎనలేనదని కోటి ఇరువైలక్షలు మంజూరు చేయించారని కాంగ్రెస్ నాయకుల అసత్య ప్రచారం నమ్మవద్దని అన్నారు.ఈ కార్యక్రమంలో రైతుబంధు మండల అధ్యక్షుడు నారాయణరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రంగురవీందర్ గౌడ్, సదాశివనగర్ మాజీ జడ్పీటీసీ రాజేశ్వర్‌రావు, మాజీ గ్రామసర్పంచ్ గంగారాం, ఎంపీటీసీదత్తాద్రి తదితరులు పాల్గొన్నారు.



సినిమా గైడ్ కామారెడ్డి

కామారెడ్డి	
శాంతి	ఓసీ
దర్శన్	మహారాజ
ప్రియా 70	ఓఎంజీ

బాన్సువాడ	
మహేశ్వరి	ఓఎంజీ
వెంకటేశ్వర	నింద

చికెన్ ధరలు



రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	160	200	220
వెన్‌కాబ్(కిలో)	170	220	230

